RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 4, సంచిక : 45 | గురువారం
జనవరి 22, 2026 | పేజీలు : 6
వెల : రూ.3-00




'నో హెల్మెట్- నో పెట్రోల్' 4లో..

# టికెట్ ప్లీజ్!

## ప్రధాన పార్టీల పెద్దల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

- ☐ తమకే టికెట్ కేటాయించేలా ఒత్తిళ్లు షురూ
- ☐ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో పోటాపోటీగా పైరవీలు
- ☐ బీజేపీ తరపున బరిలో నిలిచేందుకు యువత ఆసక్తి
- ☐ టికెట్ దక్కకపోతే పక్క పార్టీకి వెళ్లేలా కొందరి ప్లాన్
- ☐ పార్టీలకు తలనొప్పిగా టికెట్ల కేటాయింపు
- ☐ రెబెల్స్ బెడద లేకుండా ఆచితూచి అడుగులు
- ☐ గెలుపు గుర్రాల కోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభం
- ☐ పురపోరుకు ద్వితీయశ్రేణి నేతల హడావుడి




**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో:**

తెలంగాణలో పట్టణ రాజకీయాలు సందడిగా మారాయి. వచ్చే రెండు మూడ్రోజుల్లోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ వెలువడనుందనే ప్రచారంతో రాష్ట్రవ్యాప్తంగా ఆశావహుల సందడి మొదలైంది. ఇప్పటికే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో రిజర్వేషన్లు ఖరారు కావడంతో, ఏ వార్డు ఎవరికి దక్కుతుందో స్పష్టత వచ్చింది. దీంతో ఆశావహులంతా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. గెలుపు గుర్రాలను వేటాడే పనిలో పార్టీలు ఉంటే, టికెట్ కోసం నాయకుల ఇళ్ల ముందు క్యూ కట్టే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు.

**- హస్తం పార్టీలో భారీగా..**

ప్రధానంగా అధికార పార్టీలో టికెట్ల కోసం ఆశావహుల పోటీ తారాస్థాయికి చేరింది. సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో జోరుమీదున్న హస్తం పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఆశావహులు పోటెత్తుతున్నారు. ప్రతి వార్డు, డివిజన్ నుంచి కనీసం 10మందికి పైగా అభ్యర్థులు రేసులో ఉండటం విశేషం. 'మేము దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్నాం.. ఈసారి అవకాశం ఇవ్వాల్సిందే..' అని కొందరు ఒత్తిడి తెస్తుంటే, మరికొందరు 'ఎన్ని కోట్లు ఖర్చయినా పర్వాలేదు.. గెలిచి తీరుతాం' అని ఆర్థిక బలాన్ని చూపుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జుల ఇళ్లు ఇప్పుడు ఆశావహులతో కిటకిటలాడుతున్నాయి.

**- బీఆర్ఎస్ కు సైతం తలనొప్పిగా..**

మరోవైపు, ప్రతిపక్ష బీఆర్ఎస్ ఈ ఎన్నికలను తమ రాజకీయ పునరుద్ధరణకు వేదికగా మార్చుకోవాలని భావిస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి గట్టి పోటీ ఇచ్చిన ఉత్సాహంలో ఉన్న గులాబీ శ్రేణులు, పట్టణ ప్రాంతాల్లో తమకున్న పట్టును నిరూపించుకోవాలని చూస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి సైతం ఆశావహులు భారీ సంఖ్యలో టికెట్ల కోసం పార్టీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో టికెట్ల కేటాయింపు కారు పార్టీకి సైతం తలనొప్పిగా మారింది.

**- యువతపై కమలం పార్టీకి కన్ను**

ఇక బీజేపీ సైతం పట్టణాల్లో ఉన్న మధ్యతరగతి, యువత ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించింది. తమకు పట్టున్న ప్రాంతాల్లో జెండా ఎగురవేయాలని కమలనాథులు కసరత్తు ముమ్మరం చేశారు. బీజేపీ కూడా పట్టున్న ప్రాంతాల్లో బలమైన అభ్యర్థులను బరిలో దింపేందుకు సిద్ధమవుతోంది. కొన్ని కీలక మున్సిపాలిటీల్లో బీజేపీ ఆశావహులు పోటీకి సిద్ధంగా ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**- రెబెల్స్ తలనొప్పి లేకుండా..**

టికెట్ దక్కని నేతలు రెబెల్స్‌గా మారకుండా అడ్డుకునేందుకు అన్ని పార్టీలు ముందస్తు చర్యలు చేపడుతున్నాయి. బుజ్జగింపుల కోసం ప్రత్యేక టీంలను రంగంలోకి దింపేందుకు సిద్ధమవుతున్నాయి. అయితే టికెట్ దక్కని కొందరు నేతలు ఇప్పటికే పక్క పార్టీలతో టచ్‌లోకి వెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కొన్ని పార్టీలు బలమైన నేతలను ఆకర్షించేందుకు టికెట్ ఖాయం అంటూ ఆఫర్లు ఇస్తున్నాయని సమాచారం. టికెట్ దక్కని పక్షంలో స్వతంత్రులుగా పోటీ చేయడమో లేదా పక్క పార్టీలోకి జంప్ చేయడమో జరుగుతుందన్న ఆందోళన పార్టీ అధిష్టానాలను వేధిస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు టికెట్ల కేటాయింపే అతిపెద్ద సవాల్‌గా మారింది. ఈ రెండు పార్టీల నుంచి ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, అసంతృప్తులను ఎలా కంట్రోల్ చేయాలన్నదే పార్టీ పెద్దలకు కీలకంగా మారింది.

## కొమురం సూరు త్యాగాలు చిరస్మరణీయం

- ఆదివాసీల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన వీరుడు
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కోలంగూడలో సూరు విగ్రహానికి నివాళి




**వేద న్యూస్, ఆదిలాబాద్:**

ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరుడు కొమురం సూరు త్యాగాలు చిరస్మరణీయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉట్నూర్ మండలం కోలంగూడ గ్రామంలో రాష్ట్ర మంత్రి అడ్లూరు లక్ష్మణ్, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి కొమురం సూరు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. గిరిజనుల హక్కుల కోసం కొమురం సూరు సాగించిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. గిరిజనులకు పెండింగ్‌లో ఉన్న అటవీ భూమి హక్కుల పట్టాల సమస్యను సమగ్రంగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఇందిరా సౌర జల గిరి వికాసం పథకం ద్వారా గిరిజన భూములకు సాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గిరిజనులు ఆధునిక సాగు పద్ధతులు అవలంబించి ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, పీఓ యువరాజ్ మర్మాట్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ఆదివాసీలు పాల్గొన్నారు.

## తెలంగాణకు పెట్టుబడుల వర్షం

### దావోస్‌లో ఏఐ, ఏరోస్పేస్, బ్యూటీ- టెక్ రంగాల్లో చారిత్రక ఒప్పందాలు

- బ్లైజ్ సంస్థతో ఏఐ, డేటా సెంటర్లపై అవగాహన ఒప్పందం
- సర్గాడ్‌తో విమానాల నిర్వహణ కేంద్రానికి రూ.1,000 కోట్ల పెట్టుబడులు
- హైదరాబాద్‌లో ప్రపంచంలో తొలి బ్యూటీ-టెక్ జీసీసీ
- నవంబర్‌లో లోరియల్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ప్రారంభం
- వరంగల్ లేదా ఆదిలాబాద్‌లో ఎంఆర్వో కేంద్రం ప్రతిపాదన
- తెలంగాణకు గ్లోబల్ టెక్ హబ్‌గా గుర్తింపు



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ప్రపంచ ఆర్థిక వేదిక-2026 సదస్సులో తెలంగాణ ప్రభుత్వం కీలక అంతర్జాతీయ ఒప్పందాలు కుదుర్చుకొని రాష్ట్ర పారిశ్రామిక భవిష్యత్తుకు మిగతా 3వ పేజీలో..

## మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం

- త్వరలో మున్సిపాలిటీల వారీగా ఇన్‌చార్జ్‌ల నియామకం - సర్వేల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక
- 'బస్తీ బాట' కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్తాం - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3లో..

వేద న్యూస్

గురువారం జనవరి 22, 2026

# సీకేఎం.. కంపు కంపు..?



## ప్రసూతి ఆసుపత్రిలో అధ్వాన్నంగా టాయిలెట్లు



- ☐ ఇబ్బంది పడుతున్న గర్భిణులు, బాలింతలు,అటెండర్లు
- ☐ దుర్వాసనతో ముక్కు మూసుకునే పరిస్థితి
- ☐ పట్టించుకోని సంబంధిత అధికారులు
- ☐ తక్షణ చర్యలు అవసరం అంటూ డిమాండ్

**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

పేద గర్భిణులకు, బాలింతలకు భరోసా ఇవ్వాల్సిన సర్కారు దవాఖానా ఇప్పుడు రోగాలకు అడ్డాగా మారుతోంది. వరంగల్ నగరంలోని ప్రముఖ సీకేఎం ప్రసూతి ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కరువై రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆసుపత్రి అంతటా వ్యాపిస్తున్న దుర్వాసన, ముఖ్యంగా టాయిలెట్ల నుంచి వస్తున్న కంపు వల్ల ముక్కు మూసుకోకుండా ఒక్క నిమిషం కూడా నిలబడలేని పరిస్థితి నెలకొంది. అక్కడికి వెళ్లాలంటేనే రోగులు, వారి సహాయకులు వణికిపోతున్నారు.

**కంపుకొడుతున్న టాయిలెట్లు..!**

ఆసుపత్రిలోని వార్డులకు అనుబంధంగా ఉన్న టాయిలెట్లు చాలాకాలం నాటివి కావడం ఒక ఎత్తయితే, వాటిని శుభ్రం చేయకపోవడం మరో ఎత్తు. టాయిలెట్ల నుంచి వస్తున్న కంపు వార్డుల వరకు వ్యాపిస్తోంది. గాలి పీల్చుకోవడమే కష్టంగా మారిన పరిస్థితుల్లో, గర్భిణులు, పసిపిల్లలతో ఉన్న బాలింతలు, రోగులకు సేవలందించే అటెండర్లు సైతం ఆ దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. కొన్ని వార్డుల దగ్గరైతే టాయిలెట్ దగ్గరికి వెళ్లాలంటేనే వాంతులు వచ్చే పరిస్థితి ఉందని మహిళా రోగులు వాపోతున్నారు.

**పట్టించుకోని సిబ్బంది.. అధికారుల నిర్లక్ష్యం**

ఈ దుస్థితిపై రోగుల బంధువులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా క్షేత్రస్థాయి సిబ్బంది గానీ, ఉన్నతాధికారులు గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షణ లోపం వల్లనే పరిస్థితి ఇంతలా దిగజారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి నిర్వహణ కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు ఏమవుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది అటెండర్లు ఆసుపత్రి బయటకు వెళ్లి, పక్క వీధుల్లోని హోటళ్లు లేదా కమర్షియల్ కాంప్లెక్స్‌లలో టాయిలెట్లు ఉపయోగించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇది భద్రతాపరంగా కూడా ప్రమాదకరమని వారు వాపోతున్నారు.

**తక్షణ చర్యలు అవసరం**

సీకేఎం ఆసుపత్రిలోని టాయిలెట్ల దుస్థితిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని రోగులు, వారి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. పూర్తిస్థాయిలో డ్రెయినేజీ లైన్ల మరమ్మతు, కొత్త ఫ్లష్ సిస్టమ్‌లు, రెగ్యులర్ శానిటేషన్ షెడ్యూల్ అమలు చేయాలని కోరుతున్నారు. అలాగే, శానిటేషన్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుని, రోజుకు కనీసం మూడు సార్లు టాయిలెట్లు శుభ్రం చేయాలని, ఫినైల్, బ్లీచింగ్ పౌడర్ వంటి డిస్ఇన్ఫెక్టెంట్లు తప్పనిసరిగా ఉపయోగించాలని సూచిస్తున్నారు. పేదల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా, ఆసుపత్రిని మళ్లీ ఆరోగ్య ప్రదాయినిగా మార్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రైతు రక్షణ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

- టీఆర్ఆర్ఎస్ కు అడిషనల్ కలెక్టర్ అభినందన




**వేద న్యూస్, ఎల్కతుర్తి:.**

రైతుల సమస్యల పరిష్కారానికి విశేషంగా తమ వంతు కృషి చేస్తున్న టీఆర్ఆర్ఎస్( తెలంగాణ రైతు రక్షణ సమితి) ను హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్ .రవికుమార్ అభినందించారు. బుధవారం రైతు రక్షణ సమితి నాయకులతో కలిసి ఆయన ఆఫీసులో రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన -2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ హింగే, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు హింగే రవీందర్, జిల్లా సహాయ కార్యదర్శి అంబీరు శ్రీనివాస్, ఎల్కతుర్తి మండల ప్రధాన కార్యదర్శి కె మాధవరావు, పరకాల అధ్యక్షుడు మధుకర్ పాల్గొన్నారు.

# వేద న్యూస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సీఐ మొగిలి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేద న్యూస్ దినపత్రిక 2026 సంవత్సరానికి సంబంధించిన నూతన క్యాలెండర్‌ను బుధ వారం రూలర్ సీఐ మొగిలి ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా సీఐ మొగిలి మాటా ్లడుతూ.. స్థానిక వార్తలకు వేదికగా నిలుస్తున్న వేద న్యూస్ ప్రజలతో అనుబంధాన్ని మరింత బలపర్చుకోవాలని ఆకాంక్షించారు. నిష్పక్షపాతమైన జర్నలిజంతో ప్రజా సమస్యలను ముందుకు తీసుకువెళ్తున్న వేద న్యూస్ అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని అభినందించారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వేద న్యూస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా రోడ్లపై గ్రానైట్ లారీలు

- భయాందోళనలో స్థానిక ప్రజలు
- పట్టించుకోని మైనింగ్ అధికారులు
- చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్



**వేద న్యూస్, బోయినిపల్లి:**

గ్రానైట్ లారీలు అడ్డూ అదుపు లేకుండా రహదారులపై సంచరిస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో గ్రానైట్ లారీలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. గ్రానైట్ లారీల రాకపోకల వల్ల దుమ్ము, ధూళి అధికంగా ఎగసిపడుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై ప్రయాణిస్తున్నప్పుడు వెనుక నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలకు లారీలు సరైన సైడ్ ఇవ్వకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా, భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు కూడా వేగంగా ధ్వంసమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని సీపీఎం నాయకులు విమర్శించారు. మండలంలో రాత్రి 9 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకే లారీలు నడిచేలా కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. ప్రమాదాలు జరగకముందే తక్షణమే చర్యలు తీసుకోవాలని పార్టీ కన్వీనర్ గురిజల శ్రీధర్ మైనింగ్ అధికారులను కోరారు.

# ఆశయంతో యువనేత ఆర్యన్ అడుగులు

- 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా యేబూషి ఆర్యన్ కౌశిక్
- రాజకీయాలకు అతీతంగా వార్డును అభివృద్ధి చేస్తా..
- విద్యావంతుడినైన నన్ను ఆశీర్వదించి.. గెలిపించండి వార్డు ప్రజలను కోరిన ఆర్యన్



**వేద న్యూస్, జమ్మికుంట:**

రాబోయే మున్సిపల్ ఎన్నికలలో జమ్మికుంట మున్సి పల్ పరిధిలోని 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా యేబూషి ఆర్యన్ కౌశిక్ బరిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజకీయ నేపథ్యం కలిగిన తన కి అవకాశం ఇస్తే.. నిస్వార్థంగా సేవ చేస్తూ.. వార్డు ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని తెలిపారు. స్వార్థం కోసం రాజకీయాల్లోకి రావడంలేదని నిస్వార్థంగా నిష్పక్షపాతంగా ప్రజాసేవ చేయాలనే సం కల్పంతో ఎన్నికల బరిలో ఉంటున్నట్టు వెల్లడించారు.

**మెరుగైన సమాజం కోసం కృషి**

మెరుగైన సమాజం ఏర్పాడాలంటే సమస్యలపై అవగాహనతో పాటు ప్రజల మన్ననలు పొందాలని కుటిల రాజకీయాలకు దూరంగా ఉంటూ సేవే లక్ష్యంగా పనిచేయాలని మీ ముందుకు వస్తున్నానని మీ బిడ్డకు మీ ఆశీర్వాదం అందించి ఆదరిస్తే గెలిచి మీకు అండగా ఉంటానని ఏడవ వార్డు ప్రజలకు కౌశిక్ పేర్కొన్నారు. 7వవార్డులో పుట్టి పెరిగిన కుటుంబంలో ఉన్నానని, ఇక్కడి స్థితిగతులపై తనకి పూర్తి అవగాహన ఉందని.. పార్టీలకు అతీతంగా తన ను ఆశీర్వదించి గెలిపిస్తే... సేవకుడి గా పని చేస్తానని స్పష్టం చేశారు. అభివృద్ధి విషయంలో రాజీపడకుండా సమస్యల పరిష్కారంలో ముందుంటానని ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కౌశిక్ అభ్యర్థించారు.

# జమ్మికుంటలో హోమ్ గార్డ్ బరితెగింపు!

- పోలీసుల రక్షణ కోరుతున్న బాధితులు

**వేద న్యూస్, జమ్మికుంట:**



రక్షణ కల్పించాల్సిన ఖాకీ యూనిఫామ్ వేసుకుని, ఒక కుటుంబం మధ్య చిచ్చు పెట్టడమే కాకుండా..ఓ హోమ్ గార్డ్ ప్రాణహాని తలపెడు తున్నాడ ని బాధితులు పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. బాధితుల వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన ఓ వివాహిత తన భర్తతో కలిసి జీవిస్తోంది. అయితే, అదే పట్టణానికి చెందిన ఓ హోమ్ గార్డ్ సదరు మహిళపై కక్ష గట్టాడు. ఆమె పని చేసే చోట ఒక వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందంటూ ఆమె భర్తకు వాట్సాప్‌లో తప్పుడు మెసేజ్‌లు పంపడం మొదలుపెట్టాడు. ఈ మెసేజ్‌ల వల్ల దంపతుల మధ్య తీవ్ర గొడవలు జరిగాయి. నిజం తెలుసుకున్న దంపతులు జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టిన పోలీసులు ఆ మెసేజ్‌లు పంపింది స్థానిక హోమ్ గార్డ్ అని గుర్తించి అతడిని అరెస్ట్ చేశారు. అయితే, బెయిల్‌పై బయటకు వచ్చిన ఆ హోమ్ గార్డ్ ఇప్పుడు మరింత రెచ్చిపోతున్నాడు. "మేము ఫిర్యాదు చేశామన్న కోపంతో మమ్మల్ని చంపేస్తా నని బెదిరిస్తున్నాడు. మేము ఎక్కడికి వెళ్తే అక్కడికి వస్తూ నిఘా పెడుతున్నాడు. భయంతో బతకలేకపోతున్నాం" అని బాధితులు మళ్లీ పోలీసులను ఆశ్రయించారు. తమకు ప్రాణహాని ఉందని, కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, ఏసీపీ మాధవి చొరవ తీసుకుని తమకు రక్షణ కల్పించాలని, ఆ హోమ్ గార్డ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు మీడియా ముందు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడు పోలీస్ శాఖకు చెందిన వ్యక్తి కావడంతో, ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# ప్రజా ఉద్యమాల బలోపేతానికై శిక్షణా తరగతులు

- ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలను పార్టీ నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి ఎంసిపిఐయు రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు మూడు రోజులపాటు గిర్నిబావిలోని జిఆర్ బి కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ తెలిపారు. దుగ్గొండి మండలంలోని గిర్నిబావిలో పార్టీ మండల కార్యదర్శి సింగతి మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో మారుతున్న జాతీయ అంతర్జాతీయ రాష్ట్ర పరిణామాల నేపథ్యంలో పార్టీ నాయకుల కార్యకర్తల సైద్ధాంతిక స్థాయిని పెంపొందించేందుకు భవిష్యత్తు ప్రజా ఉద్యమాల నిర్మాణానికి తోడ్పడేందుకు ఎంసిపిఐ (యు) పూనుకున్నదని ఈ క్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులకు ముఖ్య నాయకత్వానికి జనవరి 22 23 24 తేదీల్లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్దికాయల అశోక్ ఓంకార్ ప్రారంభిస్తారని అన్నారు. వివిధ జిల్లాల నుంచి హాజరయ్యే పార్టీ నాయకులు సకాలంలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ తరగతుల జయప్రదానికి స్థానిక నాయకత్వం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి, కన్నం వెంకన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబా బాబూరావు, డివిజన్ కార్యదర్శి మహమ్మద్, రాజాసాయబ్ తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**వేద న్యూస్, కాజీపేట:**

హనుమకొండ జిల్లా కాజీపేట మండలానికి నూతనంగా నియమితులైన తహసీల్దార్ చెల్లమల్ల రాజును మడికొండ 46వ డివిజన్ కాంగ్రెస్ కాంటెస్ట్ కార్పొరేటర్ వస్కుల శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ అధ్యక్షుడు వస్కుల నాగరాజు, వర్ధన్నపేట ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు నార్లగిరి కుమారస్వామి, ఆరూరి మోహన్ రావు, వస్కుల శ్రీనివాస్, అలుగునూరి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రిలియంట్ హైస్కూల్‌లో 'స్పోర్ట్స్ తరంగ' ప్రారంభం

**వేద న్యూస్, వరంగల్:**

కరీమాబాద్‌లోని బ్రిలియంట్ హైస్కూల్‌లో వార్షిక క్రీడా పోటీలు 'స్పోర్ట్స్ తరంగ' ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ జూడో అసోసియేషన్ అధ్యక్షుడు, ఒలింపిక్స్ జనరల్ సెక్రటరీ బి. కైలాష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది క్రీడలను ప్రోత్సహించే గొప్ప వేడుక అని, ఇక్కడి విద్యార్థులు జీవితంలో క్రీడలు, ఆటల పట్ల సరైన ప్రేరణ పొందుతారని అన్నారు. పాఠశాల పిల్లలను ఏ స్థాయి వరకు అయినా ప్రోత్సహించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మా రవి, వరంగల్ బేస్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మైదం కుమార్, వరంగల్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ అక్తర్ పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన అద్భుతమైన మార్చ్‌పాస్ట్, డంబుల్ డ్యాన్స్, లెజిమ్ డ్యాన్స్, హౌస్ మార్చ్‌పాస్ట్‌తో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను అందరూ అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు అవినాష్ బండి, మోహన్ బండి,



ఇంచార్జ్ రజిని, పీఈటీ రంజిత్ మాట్లాడుతూ, 2026 వార్షిక క్రీడా సమావేశాన్ని అధికారికంగా ప్రారంభించినట్లు తెలిపారు. ఖో-ఖో, కబడ్డీ, క్రికెట్, రన్నింగ్, వాలీబాల్ తదితర ఆటల్లో వారం రోజుల పాటు నాలుగు హౌస్‌ల మధ్య పోటీలు నిర్వహించి, ఓవరాల్ ఛాంపియన్‌కు బహుమతి అందజేస్తామని వెల్లడించారు.

# వైభవంగా భక్త మార్కండేయ జయంతి

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొత్తపేటలో పద్మశాలి సమాజ సేవా సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ జయంతి ఉత్సవాన్ని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కార్యక్రమంలో మహిళలు మంగళహారతులతో పాల్గొని వేడుకకు శోభ చేకూర్చారు. ఈ కార్యక్రమంలో జక్కని లక్ష్మీనారాయణ, బిల్ల సత్యం, పద్మశాలి సమాజ సేవా సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జక్కని లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ భక్త మార్కండేయుడు పరమ శివ భక్తుడని, శివనామ స్మరణ ఫలితంగా మృత్యుంజయుడిగా వరం పొందాడని పేర్కొన్నారు. గ్రామ కమిటీ గౌరవాధ్యక్షులు ద్యావనపల్లి శ్రీహరి, అధ్యక్షులు, ప్రధాన కార్య



దర్శులు చిందం వేణుగోపాల్, ద్యావనపల్లి నరేష్, కమలాకర్, దుంపెటి రాములు, లక్ష్మీ నారాయణ, మల్లయ్య, చిందం శ్రీనివాస్, కృష్ణహరి, సుభాష్, నరేష్, డి. సాయి కృష్ణ, మల్లాపూర్ గ్రామ కులబాంధవులు, సర్పంచ్ ఇల్లందుల రాజు, ఆలయ కమిటీ చైర్మన్ గుగుండె కార్ల రమేష్, ఉప సర్పంచ్ బాల్ రెడ్డి, టీ. కొమురయ్య, వివిధ కుల సంఘాల అధ్యక్షులు, పుర ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలోని పద్మశాలి యువసేన బస్‌స్టాప్ వద్ద తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీ భక్త మార్కండేయస్వామి జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పద్మశాలి సంఘం శాయంపేట మండల అధ్యక్షుడు వంగర సాంబయ్య మాట్లాడుతూ.. మృకండ మహర్షి కుమారుడైన మార్కండేయుడు చిన్నతనంలోనే మృత్యువును జయించి శివుని ఆశీస్సులతో చిరంజీవిగా మారాడని తెలిపారు. పద్మశాలి సమాజానికి మార్కండేయ మహర్షి కులదైవమని, శివుని వరం వల్ల ఎప్పటికీ 16 సంవత్సరాల వయసులోనే ఉండి సృష్టి చక్రంలో జీవించే చిరంజీవుల్లో ఒకరని కొనియాడారు. మార్కండేయ స్వామి ఆశీస్సులు పద్మశాలి సమాజానికి నిత్యం అనుక్షణం ఉండాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు పండ్లు, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం శాయంపేట మండల అధ్యక్షుడు వంగర సాంబయ్య, గ్రామ అధ్యక్షుడు బాసని ప్రకాష్, జిల్లా నాయకులు పత్తి శీను, బాసని బాలకృష్ణ, దాసరి సమ్మయ్య, మచ్చ గిరి స్వామి, చైర్మన్ సామల బిక్షపతి, మండల నాయకులు చిందం రవి, బూర లక్ష్మీనారాయణ, కుసుమ శరత్, దిడ్డి ప్రభాకర్, వనం దేవరాజ్, కోమటి శేఖర్, తుమ్మ ప్రభాకర్, పూల అయిలు మల్లు, గడ్డం వెంకటేశ్వర్లు, రంగు అయిలు మల్లు తదితరులు పాల్గొన్నారు.

# 'చేయూత' ఆధ్వర్యంలో కళాకారుడికి సన్మానం

**వేద న్యూస్, కాసిపేట:**



కాసిపేట గని నంబర్ వన్ ఇంక్లైన్‌లోని సర్వే విభాగంలో పనిచేస్తున్న మాడుగుల విజయ్ అండ్ టీం, కోల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన జానపద నృత్య పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్వే ఆఫీసర్ పందిళ్ల ప్రభాకర్ రెడ్డి, సర్వేయర్ మహమ్మద్ ఖాన్‌లు మాడుగుల విజయ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆడెపు రవీందర్ మాట్లాడుతూ.. ఉద్యోగ బాధ్యతలతో పాటు కళారంగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి అంకం రాయమల్లు, ఉపాధ్యక్షులు భుక్య ప్రవీణ్, అసిస్టెంట్ చైర్మన్‌లు కాంద్రపు రవి, జూల పోషం, కస్తూరి సందీప్ పాల్గొన్నారు. అలాగే సర్వే మజ్దూర్‌లు దాగం ఆనంద్, మోహన్, కుమారస్వామి, దువ్వల ప్రవీణ్, బండి గణేష్, మేకల ఆంజనేయులు, షకీల్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆర్ఐ నియామకం అవసరం

**వేద న్యూస్, కాసిపేట:**

- రెవెన్యూ సమస్యల పరిష్కారం తప్పనిసరి
- తహసీల్దార్ కు తుడుందెబ్బ వినతి



కాసిపేట మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి వెంటనే ఆర్ఐను నియమించాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండల తహసీల్దార్ సునీల్ దేస్ పాండేకు మెమొరాండం అందజేశారు. మండలంలో ఆర్ఐ లేకపోవడం వల్ల ఆదివాసీ ప్రజలు భూ సంబంధిత ధృవీకరణ పత్రాలు, పాసుబుక్కులు, పట్టాలు తదితర రెవెన్యూ పనుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిటీ నాయకులు తెలిపారు. వెంటనే ఆర్ఐని నియమించి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ నాయకులు మాట్లాడుతూ.. మండలంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలంటే ఆర్ఐ నియామకం అత్యవసరమని అన్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడే జంగు, జిల్లా గౌరవ అధ్యక్షుడు పెంద్రం హన్మంతు, మండల గౌరవ అధ్యక్షుడు ఆత్రం జంగు, ప్రధాన కార్యదర్శి కుర్సింగా తిరుపతి, పెంద్రం ప్రభాకర్, మల్కేపల్లి సర్పంచ్ కొట్నక రఘుపతి, పెంద్రం కిషన్, పెంద్రం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలి

- రుద్రూరు ఎస్సై సాయన్న




**వేద న్యూస్, రుద్రూర్:**

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సాయన్న మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం

**వేద న్యూస్, హైదరాబాద్ :**



రాబోయే మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. త్వరలోనే మున్సిపాలిటీ వారీగా పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమిస్తామని, రేపు లేదా ఎల్లుండి వాటి ప్రకటన ఉంటుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన వారినే ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తామని చెప్పారు. జిల్లాల వారీగా సన్నాహక సమావేశాలు పూర్తయ్యాయని, సర్వేల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. 'బస్తీ బాట' కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్లి, గత పదేళ్ల అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వం ఆపేసిన పనులు, ప్రస్తుత సమస్యలను ప్రజలకు వివరిస్తున్నామని కేటీఆర్ అన్నారు. కొత్త జిల్లాల రద్దుపై ప్రజల్లో ఆందోళన ఉందని, ఈ అంశాన్ని మున్సిపల్ ఎన్నికల్లో ప్రధానంగా తీసుకెళ్తామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో స్థానిక సమస్యలే ప్రధాన అజెండాగా ఉంటాయని, స్థానిక నాయకుల ఆధ్వర్యంలోనే ప్రచారం కొనసాగుతుందని తెలిపారు. స్థానిక సమస్యలతోనే బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# తెలంగాణకు పెట్టుబడుల వర్షం

చారిత్రక మలుపు తీసుకొచ్చింది. కృత్రిమ మేధ, సెమీకండక్టర్, ఏరోస్పేస్, బ్యూటీ-టెక్ రంగాల్లో గ్లోబల్ సంస్థలతో భాగస్వామ్యాలు ఖరారయ్యాయి. కాలిఫోర్నియాకు చెందిన బ్లైజ్ సంస్థతో కృత్రిమ మేధ హార్డ్‌వేర్, డేటా సెంటర్ల అభివృద్ధిపై ఎంవోయూ కుదిరింది. హైదరాబాద్‌లో ఉన్న బ్లైజ్ పరిశోధన కేంద్రాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అమెరికాకు చెందిన సర్గాడ్ సంస్థతో విమానాల నిర్వహణమరమ్మత్తుల (ఎంఆర్వో) కేంద్రం ఏర్పాటుకు మరో ఒప్పందం కుదిరింది. వచ్చే మూడు నుంచి ఐదు ఏళ్లలో దశలవారీగా రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు సంస్థ ప్రకటించింది. వరంగల్ లేదా ఆదిలాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ప్రభుత్వం సూచించింది. అదే సమయంలో ప్రపంచ బ్యూటీ రంగ దిగ్గజం లోరియల్ సంస్థ, ప్రపంచంలోనే తొలి బ్యూటీ-టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ)ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ జీసీసీని ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభించనున్నారు. గ్లోబల్ ఇన్నోవేషన్, డేటా, కృత్రిమ మేధ, సరఫరా వ్యవస్థల కార్యకలాపాలకు ఇది ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది. సీఎం రేవంత్ రెడ్డితో లోరియల్ సీఈవో నికోలస్ హియెరోనిమస్ భేటీ అనంతరం ఈ నిర్ణయం ఖరారైంది. జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి, ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సంస్థ ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణను ప్రపంచ స్థాయి ఏఐ, ఏరోస్పేస్, బ్యూటీ-టెక్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ మూడు ఒప్పందాలు రాష్ట్రానికి భారీ పెట్టుబడులు, నూతన సాంకేతికత, వేలాది ఉద్యోగ అవకాశాలు తీసుకొస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# టీజీఎస్ఆర్టీసీ ట్రైనీ పోస్టుల రాత పరీక్ష తేదీ ఖరారు

- మార్చి 29, 2026న పరీక్ష నిర్వహణ
- ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తాం
- టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

టీజీఎస్ఆర్టీసీలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ, మెకానికల్ సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టుల కోసం దరఖాస్తుల గడువు ముగిసిందని అధికారులు తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 2026 మార్చి 29న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు వెల్లడించారు. పరీక్షకు సంబంధించిన సిలబస్, హాల్ టికెట్లు, పరీక్ష కేంద్రాలు వంటి ఇతర వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. అభ్యర్థులు టీఎస్ఎల్‌పీఆర్‌బీ అధికారిక ప్రకటనలను గమనించాలని సూచించారు. ఈ నియామక ప్రక్రియ ద్వారా టీజీఎస్ఆర్టీసీ సేవలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

# ఈసారి ఎన్నికల్లో వినూత్న తీర్పు ఉండాలి

## - అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్



**వేద న్యూస్, మహబూబ్‌నగర్ జిల్లా (వనపర్తి):**

వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో ఈసారి ప్రజల తీర్పు వినూత్నంగా ఉంటుందని, అవినీతిపరులను ఓడించి ఇండిపెండెంట్ అభ్యర్థులను ఎక్కువగా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ అన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలోని పలు వార్డుల్లో అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు పర్యటిస్తూ, మున్సిపాలిటీలో అవినీతికి పాల్పడుతున్న కొందరు నాయకుల వివరాలను ప్రజలకు తెలియజేశారు. ప్రతిసారి వార్డులు మారుస్తూ గెలుస్తూ, మున్సిపాలిటీ ఆదాయానికి నష్టం కలిగిస్తూ, డబ్బు, మద్యంతో ఎన్నికలు గెలిచే వారిని ఈసారి తప్పకుండా ఓడిస్తామని ప్రజలు స్పష్టంగా చెప్పినట్లు తెలిపారు. డా. సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. అఖిలపక్ష ఐక్యవేదిక నిర్వహించిన సర్వేలో ప్రజలు అవినీతిపరులను తిరస్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తేలిందన్నారు. ఓటు వేసే తేదీ వరకు నిరంతరం పర్యటిస్తూ, అవినీతి అభ్యర్థుల వివరాలను సాక్ష్యాలతో ప్రజల ముందుంచి, వారిని ఓడించేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. బుధవారం 5వ, 13వ, 20వ వార్డుల్లో పర్యటించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల ప్రజలు, అఖిలపక్ష ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం జనవరి 22, 2026

# ఘనంగా మార్కండేయ జయంతి



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో బుధవారం పద్మశాలి ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. మార్కండేయ జయంతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊయల కట్టి హారతి పాటలు పాడుతూ భక్తిశ్రద్ధలతో వేడుకలు జరిపారు. అనంతరం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రుద్రూర్ అధ్యక్షులు గెంటిల సాయిలు, అన్నదాత తాటిపాముల సురేష్, మోత్కూరి నారాయణ, గెంటిల గంగాధర్, పాముల శంకర్ (పిడుగు)తో పాటు పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# మేకల అక్షయ్ కుమార్‌కు సన్మానం



**వేద న్యూస్, మంచిర్యాల:**

తెలంగాణ వార్డు మెంబర్ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన చింతగూడ 2వ వార్డు సభ్యుడు మేకల అక్షయ్ కుమార్‌ను బుధవారం చింతగూడ గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సుతారి సుమలత-వినయ్ కుమార్, ఉప సర్పంచ్ ఆసంపల్లి కావ్య- అనిల్, వార్డు మెంబర్లు నాగుల లక్ష్మి-పెద్దిరాజం, పెంద్రం రవీందర్, కొండుకూరి సురేష్, మొలుమూరి సుమలత -నాగేష్, ఆరె శ్రీనివాస్, ఛీర్నేని సుస్మిత-రాకేష్, ఐత శ్రీనివాస్, ముత్తినేని రాజేష్, దుర్గం ప్రమీల-నందయ్యలు శాలువాతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి, వార్డు మెంబర్ల సమస్యల పరిష్కారానికి, ప్రజల డిమాండ్ల సాధనకు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన చింతగూడ గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులందరికీ మేకల అక్షయ్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం



**వేద న్యూస్, కాసిపేట:**

దేవాపూర్‌లోని అదాని సిమెంట్ కంపెనీ గేట్ ఎదుట అరైవ్ అలైవ్-2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాపూర్ ఎస్ఐ గంగారాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గంగారాం మాట్లాడుతూ .. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ వినియోగించవద్దని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాకు చెక్

**- పోలీసుల దాడి.. మూడు ట్రాక్టర్లు సీజ్**



**వేద న్యూస్, గంభీరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా జరుగుతున్నట్టు సమాచారం అందడంతో ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు గంభీరావుపేట ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. తనిఖీల్లో పట్టుబడిన ట్రాక్టర్లలో గంభీరావుపేటకు చెందిన రెండు, లక్ష్మీపురం తండాకు చెందిన ఒక ట్రాక్టర్ ఉన్నట్లు వెల్లడించారు. సీజ్ చేసిన వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని, అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# అనారోగ్యంతో సర్పంచ్ మృతి

**- ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నివాళి**



**వేద న్యూస్, కారేపల్లి:**

ఖమ్మం జిల్లా సింగరేణి (కారేపల్లి) మండల పరిధిలోని బోటితండా గ్రామ సర్పంచ్ భూక్య తులసీరామ్ (45) అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో తులసీరామ్ బోటితండా సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజే అనారోగ్యానికి గురికావడంతో ఖమ్మం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ పరిస్థితి క్షీణించడం తో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తులసీరామ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతితో బోటితండా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మండలంలోని సర్పంచ్‌లు, వివిధ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.

**ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సంతాపం**

సర్పంచ్ తులసీరామ్ మృతివార్త తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "తులసీరామ్ మరణం బోటితండా గ్రామానికి తీరని లోటు. నిబద్ధత గల యువ నాయకుడిని కోల్పోవడం బాధాకరం" అని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# రాజన్న కోడెలను సంరక్షించాలి

**- ఇతర అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు**
**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- అర్హులైన రైతులకు కోడెల పంపిణీ**



**వేద న్యూస్, వేములవాడ:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి గోశాల నుంచి పంపిణీ చేస్తున్న కోడెలను రైతులు సమర్థంగా సంరక్షించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్‌లో గల శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో అర్హులైన రైతులకు బుధవారం 103 జతల కోడెలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ రైతులకు కోడెలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. కోడెల కోసం ప్రకటన జారీ చేసి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. గత, ప్రస్తుత దరఖాస్తులు కలిపి మొత్తం 238 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. రెవెన్యూ, వ్యవసాయ, పశు సంవర్ధక, ఆలయ శాఖ అధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే అర్హులకు కోడెలను పంపిణీ చేసినట్లు తెలిపారు. రాజన్న ప్రసాదంగా అందజేస్తున్న ఈ కోడెలకు గడ్డి, దాణా అందజేస్తూ సక్రమంగా సంరక్షించాలని రైతులకు సూచించారు. పంపిణీ చేసిన కోడెలను వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ అధికారుల ద్వారా క్రమం తప్పకుండా తనిఖీ చేయిస్తామని తెలిపారు. కోడెలను పక్కదారి పట్టించి ఇతర అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆలయ ఈఓ రమాదేవి, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు, గోశాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 'నో హెల్మెట్- నో పెట్రోల్'




**- అమలు సామాజిక బాధ్యత**
**- వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం**

**వేద న్యూస్, వేములవాడ:**

ప్రతి పెట్రోల్ బంక్‌లో నో హెల్మెట్- నో పెట్రోల్ విధానాన్ని అమలు చేయాలని వేములవాడ రూరల్ మండలంలోని పెట్రోల్ బంక్ యజమానులకు వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం సూచించారు. ఇది సమాజంపై ఉన్న బాధ్యతగా భావించి ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్రాజం మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా జాతీయ మాసోత్సవాల సందర్భంగా మండలంలోని పెట్రోల్ బంక్ యజమానులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా ప్రాణ నష్టం జరుగుతున్నది ద్విచక్ర వాహనదారులకేనని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు క్రమశిక్షణతో వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చని చెప్పారు. పెట్రోల్ బంక్ యజమానులు సామాజిక బాధ్యతగా నో హెల్మెట్ - నో పెట్రోల్ విధానాన్ని అమలు చేయాలని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను రక్షించుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ప్రయాణికుడు ఈ విధానాన్ని విధిగా పాటించాలని ఎస్ఐ వెంకట్రాజం కోరారు.

# మెట్టుగుట్ట శివాలయం హుండీల లెక్కింపు పూర్తి



**వేద న్యూస్, మడికొండ:**

వరంగల్ మహా నగరంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన మెట్టుగుట్టపై ఉన్న శివాలయంలో బుధవారం ఉదయం ఆలయానికి చెందిన ఆరు హుండీలను ఆలయ కార్యనిర్వహణాధికారి సునీత, దేవాదాయశాఖ వరంగల్ విభాగం పరిశీలకులు అనిల్ కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ లెక్కింపులో మొత్తం రూ. 4,71,798 సమకూరినట్లు తెలిపారు. తదుపరి ఈ సంవత్సరం మహాశివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా మధ్యాహ్నం 2 గంటలకు దేవస్థాన కార్యాలయంలో లడ్డు, పులిహోర విక్రయం, కొబ్బరికాయల విక్రయం, అభిషేక పంచామృతాల విక్రయం, వాహన పార్కింగ్ నిర్వహణ, చెరుకు బండి నిర్వహణ తదితర పద్దులపై సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించగా, ఎవరూ పాల్గొనకపోవడంతో ఈ వేలం పాటలను ఫిబ్రవరి 2వ తేదీ సోమవారం రోజుకు వాయిదా వేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణు వర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, రాజరాజేశ్వర స్వామి సేవాసమితి సభ్యులు, మడికొండ పోలీస్ సిబ్బంది, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

**- కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్యప్రసన్న రెడ్డి**



**వేద న్యూస్, చొప్పదండి/రామడుగు:**

రామడుగు మండలంలోని గోపాల్రావుపేట్ గ్రామంలో పేద బెడబుడుగు జంగ కులస్థ మహిళలకు కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ఆదేశాల మేరకు ఈ శానిటరీ ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం 40:60 నిష్పత్తి ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఆదేశించడం గ్రామాలను అభివృద్ధికి దూరంగా ఉంచడమేనని విమర్శించారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న విధంగానే ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు మెంబర్ నేరెళ్ల కవిత రాజు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# పాదయాత్రగా బాసర వెళ్తున్న భక్తులకు పాలు, బిస్కెట్లు పంపిణీ



**వేద న్యూస్, రుద్రూర్:**

పిట్లం నుంచి పాదయాత్రగా బాసర అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తులకు రుద్రూర్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయం వద్ద నాయకులు పాలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండూరి ప్రశాంత్ గౌడ్, బాన్సువాడ బీజేపీ సీనియర్ నాయకులు మార్కలి ప్రకాష్ పటేల్, పార్వతీ మురళి, రుద్రూర్ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, ఉపాధ్యక్షులు బేగరి వినోద్ కుమార్, భోజికొండ అనిల్, రేపల్లి సాయిప్రసాద్, ప్రధాన కార్యదర్శి వడ్ల సాయినాథ్, యువ మోర్చా మండల అధ్యక్షులు కుమ్మరి గణేష్, మండల కోశాధికారి కటిక రామరాజు, రజినీకాంత్, నడిపి రాజేష్, వెంకట తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించామని నాయకులు తెలిపారు.

# జనశక్తి పేరుతో బెదిరింపులు..

- డబ్బులు వసూలు చేసే ముఠా సభ్యుడా అరెస్ట్
- ఒక పిస్టోల్, ఒక మ్యాగజిన్, 8 రౌండ్ల బులెట్లు స్వాధీనం
- చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు
- సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జనశక్తి పేరుతో ప్రజలను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్న ముఠాకు చెందిన మరో సభ్యుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. జనశక్తి కార్యకలాపాల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్న నలుగురు నిందితులు తోకల శ్రీకాంత్, దాసరి తిరుపతి, వంజరి సురేందర్ అలియాస్ విశ్వనాథ్ అలియాస్ బాదం సూర్య ప్రకాష్ రెడ్డి, పయ్యావుల గోవర్ధన్‌లను ఈ నెల 7వ తేదీన అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 9 ఎంఎం పిస్టోల్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన సుధాపల్లి సుధాకర్ (50), ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లి గ్రామానికి చెందిన బోయిని దేవరాజు (49), నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఉట్కూర్ గ్రామానికి చెందిన దుబ్బ మధు (30) లు పై నలుగురు నిందితులతో సంబంధాలు పెట్టుకొని, జనశక్తి పేరుతో డబ్బున్న వ్యక్తులను బెదిరించి డబ్బులు వసూలు చేయాలని ప్లాన్ వేసినట్లు తెలిపారు. అంతేకాకుండా రియల్ ఎస్టేట్, భూవివాదాల్లో జోక్యం చేసుకొని అక్రమంగా సంపాదించాలని పథకం వేసుకున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో సుధాపల్లి సుధాకర్, బోయిని దేవరాజును ఈ నెల 9వ తేదీన అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. అలాగే దుబ్బ మధును ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లి గ్రామంలో ఈ రోజు ఉదయం అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి ఒక కంట్రీమేడ్ పిస్టోల్, ఒక ఎక్స్ట్రా మ్యాగజిన్, 8 రౌండ్లు స్వాధీనం చేసుకొని ఈ రోజు రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ప్రజలను బెదిరించడం, అక్రమ కార్యకలాపాలకు పాల్పడడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ నాగేంద్రచారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంట సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, తంగలపల్లి ఎస్ఐ ఉపేంద్రచారి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రేపు సామూహిక అక్షరాభ్యాసాలు

**వేద న్యూస్, చొప్పదండి:**




వసంత పంచమి సందర్భంగా 23వ తేదీన చొప్పదండి పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలను నిర్వహించనున్నట్లు జ్ఞాన సరస్వతి ఆలయ ప్రధాన అర్చకులు సింహాచలం జగన్మోహన్ స్వామి, శ్రీ భాష్యం నవీన్ కుమార్ తెలిపారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, ఉదయం 9 గంటల నుంచి సామూహిక అక్షరాభ్యాసాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అమ్మవారి సన్నిధానంలోనే ఈ అక్షరాభ్యాసాలను నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ పవిత్ర అవకాశాన్ని తల్లిదండ్రులు వినియోగించుకొని తమ పిల్లలను అక్షరాభ్యాసానికి తీసుకువచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని

# రుద్రూరు మండల సర్పంచ్‌ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల సర్పంచ్‌ల సంఘం నూతన కమిటీని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కొండల్‌వాడి శంకర్ (రాణంపల్లి), ఉపాధ్యక్షురాలిగా పరుచూరి పద్మ (రాయకూర్ క్యాంపు), ప్రధాన కార్యదర్శిగా మచ్కూరి రమేష్ (చిక్కడపల్లి), కోశాధికారిగా కుర్లం గంగాధర్ (అంబం ఆర్), సహాయ కార్యదర్శిగా గొంటి సాయిలును నియమించారు. ఎన్నిక అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, జాహరాబాద్ పార్లమెంట్ కమిటీ మెంబర్ నడిపింటి నగేష్, రుద్రూర్ గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, రాయకూర్ సర్పంచ్ పి. గంగమ్మ, అక్బర్‌నగర్ సర్పంచ్ సీతారామరాజు, సిద్ధాపూర్ సర్పంచ్ అనిత, బొప్పాపూర్ సర్పంచ్ సుమలత, సులేమాన్‌నగర్ సర్పంచ్ ఆఫ్రిన్ బేగం తదితర సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# ప్రైమరీ స్కూల్ ను సందర్శించిన జిల్లా అధికారులు

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలం మంధారిపేట ప్రాథమిక పాఠశాలను నోడల్ ఆఫీసర్ ఎల్. నరేంద్రనాయక్, సభ్యులు బి. శివప్రసాద్, సీఎచ్. శ్రీనివాస్, శాయంపేట మండల విద్యాశాఖ అధికారి జి. బిక్షపతి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. సుధాకర్, ఉపాధ్యాయులు జి. రోహిణిలతో సమావేశమై విద్యా విషయాలకు సంబంధించిన పలు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం వారు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ, మరింత మెరుగుదల కోసం తగు సూచనలు చేశారు. పిల్లల కనీస సామర్థ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని, టీచర్ హ్యాండ్‌బుక్, టెక్స్టబుక్, వర్క్‌బుక్ మధ్య సరైన అలైన్‌మెంట్ ఉండేలా చూడాలని అధికారులు సూచించారు.

# క్రీడలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయి

- విద్యార్థులు ఆటల్లో చురుగ్గా పాల్గొనాలి
- ఎంఈఓ సైదానాయక్



**వేద న్యూస్, దామరచర్ల:**

క్రీడలు ఆడడం వల్ల దేహదారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా అలవడుతుందని మండల విద్యాధికారి సైదానాయక్ అన్నారు. మండలంలోని బొత్తలపాలెం మోడల్ స్కూల్‌లో సీఎం కప్ క్రీడలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులు క్రీడల్లో చురుగ్గా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాచ్యా తండా సర్పంచ్ సుజాత రవి నాయక్, కొండ్రపోల్ కాంప్లెక్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బాలు నాయక్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నరహరి, వ్యాయామ ఉపాధ్యాయులు షమిమ్ అక్తర్, రాము తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులు పీఆర్ చట్టానికి అనుగుణంగా పాలించాలి



- పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి అవసరం
- ప్రతి ఏడాది ఆరు గ్రామసభలు నిర్వహించాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేద న్యూస్, వేములవాడ:**

జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టానికి అనుగుణంగా పాలించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. పారిశుధ్య పనులు, మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఇల్లంత కుంట, తంగళ్లపల్లి మండలాల సర్పంచులకు వేములవాడ పట్టణంలోని జవహర్‌లాల్ నెహ్రూ బీఈడీ కళాశాలలో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుండగా, బుధవారం ఇంచార్జి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి ఏడాది ఆరు గ్రామసభలు నిర్వహించాలని, పంచాయతీ తీర్మానాల మేరకే అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. నిధుల దుర్వినియోగం జరగకుండా చూడాలని, అన్ని రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిత్యం చేయించాలని, చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డులకు తరలించాలని, తడి చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్తను తగలబెట్టవద్దని స్పష్టం చేశారు. దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మంచినీటి సరఫరాపై దృష్టి పెట్టాలని, ప్రతి నెల 1, 11, 21 తేదీల్లో ట్యాంకులను శుభ్రం చేయించాలని ఆదేశించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి వనరులపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సర్పంచులను కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దిన్, తహసీల్దార్ విజయప్రకాశ్ రావు, వివిధ మండలాల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్, ఉపసర్పంచ్‌కు సన్మానం

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో వెల్నెస్ హాస్పిటల్ నిజామాబాద్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ సందీప్ ఆధ్వర్యంలో బుధవారం సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ఉపసర్పంచ్ షేక్ నిస్సార్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద త్వరలో వెల్నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యాప్ ద్వారా రైతులకు యూరియా పంపిణీ

**వేద న్యూస్, దామరచర్ల:**



యూరియా యాప్ ద్వారా దామరచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఋషేంద్ర మణి మాట్లాడుతూ, రైతులు యూరియా ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో బుకింగ్ చేసుకునే సమయంలో తాము వాస్తవంగా ఏ పంట వేశారో అదే పంటను నమోదు చేసుకొని రావాలని సూచించారు. వేరే పంటను నమోదు చేయరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పార్వతి, సీఈఓ వెంకట్ రెడ్డి, రైతులు రాంరెడ్డి, వీర కోటి రెడ్డి, లావురి దాస్రు, వినోద్, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ సీజ్

- డ్రైవర్‌పై కేసు నమోదు



**వేద న్యూస్, కోనరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్టు నమ్మదగిన సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు కోనరావుపేట ఎస్సై కే. ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది కనగర్తి గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించగా, ట్రాక్టర్ డ్రైవర్‌గా ఉన్న ఓదెల రమేష్ కనగర్తి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తప్పవని కోనరావుపేట పోలీసులు హెచ్చరించారు.

## 'దాచేపల్లి' మృతదేహానికి వైరా ఎమ్మెల్యే నివాళులు

**వేద న్యూస్, కారేపల్లి:**



సింగరేణి మండలం గాదెపాడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాచేపల్లి కృష్ణారెడ్డి గుండెపోటుతో బుధవారం మధ్యాహ్నం హఠాన్మరణం చెందారు. ఆయన మృతితో నియోజకవర్గంలో విషాదఛాయలు అలముకున్నాయి. విషయం తెలిసిన వెంటనే వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ గాదెపాడులోని కృష్ణారెడ్డి నివాసానికి చేరుకొని పార్థివ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "కృష్ణారెడ్డి నిబద్ధత కలిగిన నాయకులు. వారి మరణం పార్టీకి, ఈ ప్రాంతానికి తీరని లోటు" అని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ విషాద సమయంలో కృష్ణారెడ్డిని కడసారి చూసేందుకు గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే వెంట పలువురు సర్పంచ్‌లు, కాంగ్రెస్ మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

## వడియారం రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ ప్రారంభించిన ఎంపీ



**వేద న్యూస్, చేగుంట:**

ప్రయాణికుల సౌకర్యార్థం వడియారం రైల్వే స్టేషన్‌లో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. బుధవారం ఆయన స్వయంగా రిజర్వేషన్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వడియారం స్టేషన్‌లో త్వరలో రాయలసీమ, దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంతో స్థానిక ప్రయాణికులకు మరింత సౌకర్యం కలుగుతుందని ఆయన తెలిపారు.

## సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షునికి సన్మానం

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రాణంపల్లి సర్పంచ్ కొండల్వాడి శంకర్‌ను మండల కేంద్రంలో బుధవారం నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు అభినందనలు తెలుపుతూ, మండలంలోని సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి ఆయన నాయకత్వం ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పత్తి రాము, అక్కపల్లి నాగేందర్, పార్వతీ ప్రవీణ్, గాండ్ల రమేష్, డిల్లీ హనుమండ్లు, దేశాయ్ ప్రభాకర్, ఈర్వ నాగరాజు, మాశెట్టి గణేష్, క్లిక్ రవి తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్



## ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు

- ఎరువుల కొరత లేకుండా చూడాలి
- జిల్లా సహకార అధికారి డి. కృష్ణ



**వేద న్యూస్, చిన్న చింతకుంట:**

ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చిన్న చింతకుంట మండలం అప్పంపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా సహకార అధికారి డి. కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన యూరియా, గ్రోమోర్ వంటి రసాయన ఎరువులు సరిపడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ సెక్రటరీ బషీర్‌ను ఆదేశించారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు సరఫరా చేయాలని సూచించారు. తెలంగాణ సహకార కమిషనర్ ఆదేశాల మేరకు పీఏసీఎస్ అప్పంపల్లి పరిధిలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగుకు లభించే సబ్సిడీ, డ్రిప్ సబ్సిడీ తదితర అంశాలపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి శృతి, వ్యవసాయ అధికారి రాజేష్ ఖన్నా, దేవరకద్ర వ్యవసాయ సంఘం అధ్యక్షులు, ఓపీఐసీ సి. నారాయణరెడ్డి, పీఏసీఎస్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఓ. శ్రీనివాసులు, పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు.

## జాగ్రత్తలతో ప్రమాదాలకు దూరం

- అందరూ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి
- శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్



**వేద న్యూస్, శాయంపేట:**

రహదారి ప్రమాదాలను తగ్గించడం, ప్రజల్లో భద్రతా చైతన్యం కల్పించడం లక్ష్యంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జక్కుల పరమేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అలాగే ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపివేయరాదని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని అన్నారు. వ్యక్తిగత జాగ్రత్తలు పాటించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మరణిస్తే వారి కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## జీవితోత్సవ దినం
### జీవితం విలువను తిరిగి గుర్తు చేసుకునే రోజు

**వేద న్యూస్ డెస్క్:**

జీవితోత్సవ దినం అనేది ఒక సాధారణ అంతర్జాతీయ దినంగా మాత్రమే చూడలేం. మనిషి జీవితాన్ని ఎలా జీవిస్తున్నాడు, ఎందుకు జీవిస్తున్నాడు, ఏమి కోల్పోతున్నాడు అనే లోతైన ప్రశ్నలను మన ముందుంచే రోజు ఇది. రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు పరుగులు, బాధ్యతలు, పోటీలు, ఒత్తిళ్ల మధ్య జీవితం గడిచిపోతున్నాడ నిజంగా మనం జీవిస్తున్నామా? లేక కేవలం బ్రతుకుతున్నామా? అనే ఆత్మపరిశీలనకు ఈ రోజు ఒక అవకాశం కల్పిస్తుంది. జీవితం విలువైనదని తెలుసుకోవడానికి మరణాన్ని చూసే అవసరం లేదు; జీవితం ఉన్నప్పుడే దాని విలువను గుర్తించడమే అసలైన విజ్ఞత.

నేటి సమాజంలో జీవితం ఒక లక్ష్యాల జాబితాగా మారిపోయింది. చదువు పూర్తవ్వాలి, ఉద్యోగం రావాలి, ప్రమోషన్ పొందాలి, ఇల్లు కట్టాలి, స్థిరపడాలిడ ఇలా ఒక లక్ష్యం పూర్తవగానే మరో లక్ష్యం ముందుకొస్తుంది. ఈ ప్రయాణంలో ఆనందం ఎక్కడో మధ్యలోనే మిగిలిపోతోంది. సాధించని దానిపైనే మన దృష్టి నిలిచిపోవడం వల్ల, ఇప్పటికే సాధించినవి మన కళ్లకు కనిపించడంలేదు. జీవితోత్సవ దినం మనకు చెబుతున్న సత్యం ఇదే ఆనందం అనేది భవిష్యత్తులో కాదు, ఈ క్షణంలోనే ఉంది. దాన్ని గమనించలేకపోతే, ఎంత సంపాదించినా, ఎంత ఎదిగినా మన జీవితం ఖాళీగానే ఉంటుంది.

కృతజ్ఞత భావం జీవితాన్ని అందంగా మార్చే శక్తివంతమైన ఆయుధం. మన దగ్గర లేనివాటిని లెక్కపెట్టడం మనకు అలవాటైపోయింది గానీ, ఉన్నవాటిని గుర్తించి ధన్యవాదాలు చెప్పుకోవడం మరిచిపోయాం. ఆరోగ్యం, కుటుంబం, స్నేహితులు, ఉపాధి, స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం, ఇవన్నీ సాధారణంగా అనిపించినా, ఇవే మన జీవితానికి పునాది. ఈ పునాది కూలిపోయినప్పుడే వాటి విలువ మనకు అర్థమవుతుంది. జీవితోత్సవ దినం మనకు ముందుగానే ఈ నిజాన్ని గుర్తుచేసి, ఉన్నదానితో సంతృప్తిగా జీవించమని సూచిస్తుంది.

సానుకూల దృక్పథం లేకుండా జీవితం భారంగా మారుతుంది. సమస్యలు లేని జీవితం ఎవరికి లేదు. కానీ ఒకే సమస్య ఇద్దరిని రెండు విధాలుగా ప్రభావితం చేస్తుంది. ఒకరికి అది ఓటమిలా అనిపిస్తే, మరొకరికి అదే అనుభవం పాఠంగా మారుతుంది. పరిస్థితులు మన చేతుల్లో ఉండకపోవచ్చు, కానీ వాటిని ఎలా ఎదుర్కొంటామన్నది మాత్రం పూర్తిగా మన మీదే ఆధారపడి ఉంటుంది. జీవితోత్సవ దినం ఈ దృక్పథ మార్పును మనలో నాటే ప్రయత్నం చేస్తుంది. బాధల్లోనూ అర్థాన్ని వెతకడం, కష్టాల్లోనూ ఆశను చూడడం నేర్చుకున్నప్పుడే జీవితం మనపై గెలుస్తుంది.

జీవనార్థం అనే ప్రశ్నకు ప్రతి ఒక్కరికీ ఒకే సమాధానం ఉండదు. కానీ ఆ ప్రశ్నను వేసుకోవడమే మనిషిని సాధారణ జీవితం నుంచి అర్థవంతమైన జీవితం వైపు నడిపిస్తుంది. నేను కేవలం నా కోసం మాత్రమే బ్రతుకుతున్నానా? నా జీవితం వల్ల ఎవరికైనా మేలు జరుగుతోందా? అనే ఆలోచనలు వచ్చినప్పుడే మనిషి నిజంగా ఎదుగుతాడు. పెద్ద గొప్ప పనులు చేయకపోయినా, రోజూ చేసే చిన్న మంచి పనులు ఒకరిని ప్రోత్సహించడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం, నిజాయితీగా పని చేయడం జీవించడమే అసలైన ఉత్సవం.సానుకూల దృక్పథం లేకుండా జీవితం భారంగా మారుతుంది. సమస్యలు లేని జీవితం ఎవరికి లేదు. కానీ ఒకే సమస్య ఇద్దరిని రెండు విధాలుగా ప్రభావితం చేస్తుంది. ఒకరికి అది ఓటమిలా అనిపిస్తే, మరొకరికి అదే అనుభవం పాఠంగా మారుతుంది. కానీ వాటిని ఎలా ఎదుర్కొంటామన్నది మాత్రం పూర్తిగా మన మీదే ఆధారపడి ఉంటుంది.

ఈ రోజు వ్యక్తిగతంగా ఆలోచించాల్సిన మరో ముఖ్యమైన అంశం జీవనార్థం. నేను ఎందుకు జీవిస్తున్నాను? నా జీవితం ఎవరికైనా ఉపయోగపడుతోందా? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన అవసరం ఉంది. జీవితం అనేది కేవలం మనకోసమే కాదు; మనతో పాటు ఉన్నవారికీ, సమాజానికీ ఏదో ఒక రూపంలో మేలు చేయాల్సిన బాధ్యత కూడా మనపై ఉంది. ఒక చిన్న సహాయం, ఒక మంచి మాట, ఒక సానుభూతి ఇవి మన జీవితానికే కాదు, ఇతరుల జీవితాలకూ అర్థాన్ని ఇస్తాయి. అర్థవంతమైన జీవితం అంటే పెద్ద పెద్ద కార్యాలే కాదు; రోజూ చేసే చిన్న మంచి పనుల సమాహారమే.

చివరగా జీవితోత్సవ దినం మనకు ఇచ్చే సందేశం చాలా సరళమైనది, కానీ చాలా లోతైనది. జీవితం రేపటి కోసం మాత్రమే కాదు, ఈ క్షణం కోసం కూడా. నిన్నటి పశ్చాత్తాపాల్లో మునిగిపోకుండా, రేపటి భయాల్లో కొట్టుకుపోకుండా, ఈ రోజును పూర్తిగా జీవించడం నేర్చుకోవాలి. నవ్వడం, ప్రేమించడం, క్షమించడం, కృతజ్ఞత చెప్పడం ఇవే నిజమైన జీవితోత్సవాలు. ఒక రోజుకే పరిమితం కాకుండా, ప్రతి రోజును జీవితోత్సవంలా మార్చుకోగలిగితేడ అదే మనకు లభించిన జీవితానికి ఇచ్చే అత్యుత్తమ గౌరవం.

## రెడ్ క్రాస్ రాష్ట్ర పాలక మండలి తొలి సమావేశం

**వేద న్యూస్, హనుమకొండ:**

రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి తొలి సమావేశం లోక్ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు శ్రీ విష్ణుదేవ్ వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందించే మానవతా సేవలను మరింత విస్తృతం చేయాలని, యువత భాగస్వామ్యంతో రెడ్ క్రాస్ కార్యకలాపాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఆరోగ్యం, విపత్తు నిర్వహణ, రక్తదానం, పోషణ రంగాల్లో రెడ్ క్రాస్ పాత్రను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో రాష్ట్ర ఏజీఎం నిర్వహణ, రెడ్ క్రాస్ కార్యకలాపాల విస్తరణ, రక్తదాన శిబిరాల సంఖ్య పెంపు, శాశ్వత సభ్యత్వ నమోదు పెంపుపై చర్చ జరిగింది. ప్రతి జిల్లాలో రెడ్ క్రాస్‌ను బలోపేతం చేయడానికి తన వంతు సహకారం అందిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారు. ఈ



సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం. దాన కిషోర్, అనితా రామచంద్రన్ ఐఏఎస్, ఆయెషా మస్రత్ ఖణం ఐఏఎస్, జి. వెంకటేశ్వర్లు ఐఏఎస్, హనుమకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలక మండలి సభ్యులు, వివిధ జిల్లాల రెడ్ క్రాస్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగం

- సర్పంచ్ తెలుగు శివకుమార్
- పర్దీపూర్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**వేద న్యూస్, చిన్న చింతకుంట:**

పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పర్దీపూర్ సర్పంచ్ తెలుగు శివకుమార్ అన్నారు. చిన్న చింతకుంట మండలం పర్దీపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద లబ్ధిదారులు కుమ్మరి బాలకిష్టన్న, కురవ జయమ్మలకు సర్పంచ్ తెలుగు శివకుమార్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అనారోగ్యం బారిన పడ్డ పేదవారికి సీఎంఆర్ఎఫ్ ఎంతో భరోసానిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కురుమన్న, ఉపసర్పంచ్ నేరటి నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ ప్రెసిడెంట్ బురనప్ప, కటికే పీరు మహమ్మద్, వెంకటేష్, ఉప్పరి కృష్ణయ్య, హన్మిరెడ్డి, బ్రహ్మానందారెడ్డి, కృష్ణారెడ్డి, డోలు మల్లప్ప, సీనియర్ కమ్యూనిస్టు రాష్ట్ర నాయకులు కొల్ల వెంకటన్న, తెలుగు వెంకటేష్, విజయలక్ష్మి, ప్రకాశ్, వార్డు మెంబర్‌తో పాటు పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో సీమంతం, అక్షరాభ్యాసం వేడుక

**వేద న్యూస్, కారేపల్లి:**


కారేపల్లి మండల కేంద్రంలోని భాగ్యనగర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల అంగన్‌వాడీ సెంటర్-2లో బుధవారం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ బానోత్ హీరాలల్ హాజరై గర్భిణులకు పూలు, పండ్లు, గాజులు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లీబిడ్డల క్షేమమే అంగన్‌వాడీల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సీమంతం అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించగా, సర్పంచ్ చిన్నారులను ఒడిలో కూర్చోబెట్టుకుని విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భిక్కులాల్, వార్డు సభ్యులు గాంధీ, సంధ్య, భూలి, మహేష్, పంచాయతీ




కార్యదర్శి పెండ్రా అనిల్ కుమార్, సందీప్, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దొంగతనం కేసుల్లో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



రెండు దొంగతనాలు చేసిన కేసుల్లో నిందితుడికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెలువరించినట్లు సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. కొనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన కొమ్ము మల్లయ్య సిరిసిల్లలో తన బైక్ చోరీకి గురైన ఘటన, అలాగే రెడ్డివాడకు చెందిన గౌరిశెట్టి శ్రీనివాసన్ బైక్ చోరీ కేసుల్లో తంగళ్ళపల్లి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్‌ను నిందితుడిగా గుర్తించి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ రెండు కేసుల్లో చార్జిషీట్ దాఖలు చేసిన అనంతరం, కోర్టులో 10 మంది సాక్షులను ప్రవేశపెట్టగా, ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదనలు వినిపించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్, నిందితుడికి రెండు కేసులలో కలిపి రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధించినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

## కటోరా హౌజ్ పునరుద్ధరణకు పూర్తి సహకారం

**వేద న్యూస్ హైదరాబాద్ :**

గోల్కొండ కోట ప్రాంగణంలో ఉన్న 450 ఏళ్ల చరిత్ర కలిగిన కటోరా హౌజ్ పునరుద్ధరణకు హైడ్రా పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. చారిత్రక నీటి వనరుల సంరక్షణ అత్యంత అవసరమని పేర్కొంటూ, కటోరా హౌజ్‌కు పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర పురావస్తు శాఖ సంరక్షణలో ఉన్న ఈ చారిత్రక జలాశయాన్ని బుధవారం హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కటోరా హౌజ్ పరిరక్షణకు నిర్మాణ్ ఎన్‌జీవో ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్మాణ్ ఎన్‌జీవో తరఫున పనులను పర్యవేక్షిస్తున్న కల్పనా రమేష్, అలాగే ఆర్కియాలజీ విభాగం అధికారులు చేపడుతున్న చర్యలను కమిషనర్‌కు వివరించారు. నీటి ట్యాంక్‌లో చెత్త వేయకుండా ఎత్తైన ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం, చుట్టూ పాత్‌వే అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిపారు. అలాగే ఈ చారిత్రక నీటి వనరులోకి వెళ్లిన మురుగు నీటి పైపు లైన్‌కు ప్రత్యామ్నాయం చూపేందుకు హైడ్రా సహకారం అవసరమని కోరారు. అభివృద్ధి పనుల సమయంలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు హైడ్రా



అనుభవం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా స్పందించిన హైడ్రా కమిషనర్, కటోరా హౌజ్ జలాశయం పునరుద్ధరణకు హైడ్రా పూర్తిస్థాయిలో సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన సాంకేతిక సహాయం అందిస్తామని తెలిపారు. చారిత్రక చెరువులు, జలవనరుల పరిరక్షణ భవిష్యత్ తరాల కోసం కీలకమని పేర్కొంటూ, ఈ అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణను నివేదిక రూపంలో అందించాలని నిర్మాణ్ ఎన్‌జీవో, ఆర్కియాలజీ శాఖ అధికారులను కోరారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073